ప్రజాశక్తి
గురువారం 2 మార్చి 2023
5
అనంతపురం





గ్యాస్ బండ..!

కేంద్ర ప్రభుత్వం సామాన్యుడిపై మరో గుదిబండ మోపింది. వంట గృహ వినియోగానికి వాడే సిలిండర్‌పై ఏకంగా రూ.50 పెంచింది. ఇక కమర్షియల్ సిలిండర్‌పై రూ.350 పెంచేసింది. పెరిగిన ధరలతో సామాన్యుడి గుండె దబేల్ మంటోంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలు, కరోనా కష్టాలతో సతమతం అవుతున్న జనంపై గ్యాస్ బండను వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్యులపై భారాలు వేస్తూ, కార్పొరేట్లకు కొమ్ము కాస్తోంది అంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



- గృహ సిలిండర్ రూ.50 పెంపు
- కమర్షియల్ రూ.350...
- ఉమ్మడి జిల్లా ప్రజలపై రూ.2.50 కోట్ల భారం
- పెరిగిన ధరలపై ప్రజల ఆగ్రహం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆరు మాసాలుగా గ్యాస్ ధరలో పెరుగుదల లేదని అంతా ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో మరోమారు గ్యాస్ భారాన్ని పెరిగింది. ఈసారి ఏకంగా సిలిండర్‌పై గృహ వినియోగానికి రూ.50 పెరిగితే వాణిజ్యానికి సిలిండర్‌పై ఏకంగా రూ.350 పెంచేశారు. సామాన్యుల ఆదాయాలు తగ్గి ఇప్పటికే ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో గ్యాస్ భారాన్ని మోపడం పట్ల సర్వత్రా ఆందోళనలు, ఆగ్రహం వ్యక్తమవుతోంది. అనంతపురంలో బుధవారం నుంచి సిలిండర్ ధర రూ.1220కు చేరుకుంది. కరోనా సంక్షోభం నుంచి ఇంకా కోలుకోక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న క్రమంలో గ్యాస్ ధరలను పెంచడంపై పేదలు గగ్గోలు పెడుతున్నారు. కేంద్రం తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలతో సామాన్యుడి జీవనంపై భారం పడుతోంది. నిత్యం పెరుగుతున్న ఈ ధరలతో రోజు కూలీలు, చిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా మారుతోంది.

గృహ వినియోగదారులపై నెలకు అదనంగా రూ.3.45 కోట్ల భారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 88 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 16 లక్షల వరకు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 60 వేల వరకు వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. నెలకు సగటున ఐదు లక్షల సిలిండర్ల వరకు వినియోగంలో ఉంటున్నాయి. ఈ లెక్కన గృహ సిలిండర్లపై నెలకు రెండున్నర కోట్ల వరకు భారం ప్రజలపై పడనుంది. ఇక వాణిజ్య సిలిండర్లపై వ్యాపారులపై మరింత అదనంగా భారం ఉండనుంది. సగటున అర కోటి వరకు భారం వాణిజ్య సిలిండర్లు వాడే వారిపై పడనుంది. దీనిపై సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం నాడు నిరసన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఆయా కంపెనీలు సర్వీసు ఛార్జీల పేరుతో వసూలు చేసే అదనపు బాదుడు కూడా సామాన్యుడిపై పడుతోంది. తెస్తోంది.

గ్యాస్ భారం తగదు...

అసలే వ్యాపారాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇదే సమయంలో గత ఏడాది వాణిజ్య సిలిండర్‌పై ఏకంగా రూ.1100 వరకు పెరిగింది. ఇప్పుడు మళ్లి ఒకేసారి రూ.350 పెంచితే మాకు జరిగే వ్యాపారాల్లో ఇదో భారం కానుంది. పాల ధర కూడా మూడు మాసాల్లో లీటరుపై ఏకంగా రూ.20 పెరిగింది. గతంలో రూ.50 లీటరున్న పాలు ఇప్పుడు రూ.70 అయ్యాయి. ఒకవైపు పాల ధర పెరగడం, తాజాగా గ్యాస్ ధర పెరిగితే తమకు మిగిలేది ఏమీ ఉండదు.

నిసార్, టీ స్టాల్ వ్యాపారి, అనంతపురం.

మోయలేని భారాలు...

నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ భారాలను మోయలేని స్థితిలో ఉంటున్నాం. ఏదీ కొనాలన్న ధరలు అధికంగానున్నాయి. ఇటువంటి తరుణంలో తిరిగి గ్యాస్ ధరలు పెంచడం సరైంది కాదు. సామాన్యులకు వెసలుబాటు కల్పించే చర్యలను ప్రభుత్వం తీసుకోవాలి. ఒకవైపు పెట్రోల్, మరో వైపు విద్యుత్ ఛార్జీలు , నిత్యావసర వస్తువుల ధరలు అన్నీ పెరుగుతూపోతే సామాన్యుడి జీవనం దుర్భరంగా మారుతోంది.

ఆరీఫా , గృహిణి అనంతపురం నగరం.

గ్యాస్ ధరలను తగ్గించాలి

ప్రజలపై భారాలు మోపేలా కేంద్రం ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణం ఉప సంహకరించుకోవాలి. ఒకవైపు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు దుర్భరమైన జీవనం గడపుతున్నారు. గ్యాస్ ధరలను రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు పెంచడం దారుణం. 4 సంవత్సరాల క్రితం రూ.417 ఉన్న డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్ ధర నేడు రూ.1200కు పైగా పెరిగింది. గ్యాస్‌పై ప్రభుత్వం సబ్సిడీ వేయడం రెండు సంవత్సరాల నుంచి నిలిపేసింది. ఇలా ధరలు పెంచడం పూర్తిగా పేద, మధ్య తరగతిపై దాడి తప్ప మరొకటి కాదు. వాణిజ్య సిలెండర్ ఒక్కసారిగా రూ.350 పెంచడం వల్ల స్వయం ఉపాధి పొందుతున్నవారు.. చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం మూలిగే నక్కపై తాటి పండులా భారాలు మోపడం గర్హనీయం. కార్పొరేట్లకు రాయితీలిచ్చి దేశాన్ని దోచిపెడుతున్న బిజెపి పాలకులు సామాన్యులపై భారాలు వేసి నడ్డి విరుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను గురించి పెంచిన సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి.

వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

రెండు మండలాలుగా 'అనంత'

ఎట్టకేలకు రెవెన్యూ మండలాల విభజన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

చాలా కాలంగా ఉంటూ వస్తున్న అనంతపురం రెవెన్యూ మండలం పునర్విభజన నోటిఫికేషన్ వెలువడింది. అనంతపురం జిల్లా కేంద్రంగా ఉన్న అనంతపురం రెవెన్యూ మండలంలో అత్యధిక జనాభా ఉండటంతోపాటు అనంతపురం నగర పాలక సంస్థ, రెవెన్యూ గ్రామాలు కలిపి మొత్తం మూడు లక్షలకుపైగా జనాభా ఉంది. దీంతో రెవెన్యూపరమైన సమస్యలతో వెళ్లే ప్రజలకు సేవలందటంలో అనేక సమస్యల పరిష్కారానికి జాప్యం జరుగుతూ వచ్చేది. దీంతో రెండు రెవెన్యూ మండలాలు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలోనూ, ఇతర ప్రజా సంఘాలు సైతం డిమాండ్ చేయడమే కాకుండా పోరాటాలు చేశారు. వీటన్నింటి ఫలితంగా ప్రభుత్వం ఎట్టకేలకు రెవెన్యూ మండలాల పునర్విభజనకు సిద్ధమై నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇక నుంచి అనంతపురం అర్బన్, రూరల్ మండలాలుగా విభజన జరగనుంది.

గ్రామాల విభజన ఈ విధంగా ఉన్నాయి

అనంతపురం మండలం పరిధిలో అనంతపురం నగరంతోపాటు మొత్తం 24 రెవెన్యూ గ్రామాలుగా అనంతపురం రెవెన్యూ మండలం ఉండేది. సుమారు మూడు లక్షలకుపైగా జనాభా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అందరి వెసలుబాటు లభించే విధంగా ఈ కింది విధంగా విభజన చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది.

అనంతపురం అర్బన్ : అనంతపురం అర్బన్ మండలం పరిధిలో అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని 28 రెవెన్యూ వార్డులు 74 సచివాలయాలు ఉంటాయి. ఎ.నారాయణపురం, అనంతపురం రూరల్, కక్కలపల్లి, రుద్రంపేట, పాపంపేట పంచాయతీలు అనంతపురం అర్బన్ పరిధిలో ఉంచారు.

అనంతపురం రూరల్ : అనంతపురం రూరల్ పరిధిలో మొత్తం 19 రెవెన్యూ గ్రామాలున్నాయి. కొడిమి, తాటిచెర్ల, సోములదొడ్డి, రాచానపల్లి, సజ్జలకాలువ, కురుగుంట, గొల్లపల్లి, కామారుపల్లి, ఆలమూరు, కాటిగానికాలువ, కక్కలపల్లి, పాపంపేట (కొంతభాగం), ఉప్పరపల్లి, ఇటుకలపల్లి, జంగాలపల్లి, కందుకూరు, చియ్యేడు, మన్నీలా, కక్కలపల్లిలో మరికొంత భాగం కలిపి అనంతపురం రూరల్ మండలంగా ఉండనుంది.

అభ్యంతరాలకు 30 రోజుల గడువు

రాష్ట్ర ప్రభుత్వం మండలాల పునర్విభజన చేస్తూ నోటిఫికేషన్ బుధవారం విడుదల చేసింది. ఇందులో ఏదైనా ఇబ్బందులు, సూచనలు చేయాల్సి ఉంటే 30రోజుల్లో చేయడానికి అవకాశం కల్పిస్తారు. ఆ తరువాత ఫైనల్ నోటిఫికేషన్ వెలువడుతుంది. మొత్తంగా చాలాకాలంగా అనంతపురం ప్రజలు కోరుతున్న విధంగా రెవెన్యూ మండలాల పుర్విభజన ప్రక్రియను మార్గం సుగమం అయినట్టయింది.



వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

శాతవాహన ఇస్పాత్ ఫ్యాక్టరీలో దళారుల హవా

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండలంలోని శాతవాహన ఇస్పాత్ ఫాక్టరీలో దళారుల హవా కొనసాగుతోందని కూలీలు వాపోతున్నారు. ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు రోజు కూలి రూ.450గా నిర్ధారించారు. అయితే రోజు కూలి డబ్బుల్లోంచి రూ.50 కట్‌చేసి రూ.400 మాత్రమే ఇస్తున్నారు. నెల రోజుల పనికి రూ.13,500 చెల్లించాలి. కాని రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే ఆ డబ్బును మేస్త్రీలకు ఇస్తున్నామని యాజమాన్యం చెబుతోంది. మేస్త్రీలకు ఫ్యాక్టరీ యాజమాన్యమే కూలి డబ్బులు ఇస్తుందని తొలుత చెప్పారన్నారు. ప్రస్తుతం తమ కూలి డబ్బుల్లో రూ.50 కోత విధించి మేస్త్రీలకు ఇస్తున్నామని చెప్పడం ఎంతవరకు న్యాయమని కూలీలు ప్రశ్నిస్తున్నారు. రెండు నెలలుగా యాజమాన్యం కూలి డబ్బులు ఇవ్వలేని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఫ్యాక్టరీలో కూలీలకు భద్రత కూడా లేదన్నారు. బూట్లు, సాక్సులు, గ్లౌజులు, హెల్మెట్ తదితర వస్తువులు ఇవ్వడం లేదని కూలీలు చెబుతున్నారు. మామూలు చెప్పులు వేసుకుని పనులు చేస్తుండడంతో ఇనపముక్కలు తగిలి కాళ్లు, చేతులు సెప్టిక్ అవుతున్నాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు అనారోగ్యానికి గురైతే ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి ఎలాంటి సాయం అందడంలేదన్నారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, బీమా సౌకర్యం కల్పించలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా శాతవాహన ఫ్యాక్టరీ యాజమాన్యం కూలీలకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, ఇన్సూరెన్స్, పిఎఫ్ జమచేయాలని, సేఫ్టీ వస్తువులు అందజేయాలని, మేస్త్రీల పేరుతో తమ కూలి డబ్బుల్లో కోత విధించొద్దని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.



సమస్యలు విన్నవిస్తున్న కార్మికులు

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం..

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రులు ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్‌ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై జిల్లాలో తీసుకుంటున్న చర్యలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా బుధవారం నాడు వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య చాలా ఎక్కువగా ఉన్నందున బ్యాలెట్ పేపర్ సైజు విషయమై కేంద్ర ఎన్నికల సంఘం అనుమతికి పంపామన్నారు. వారి నుంచి రెండు రోజుల్లో అనుమతి వస్తుందన్నారు. బ్యాలెట్ పేపర్లకు అనుగుణంగా బ్యాలెట్ బాక్స్‌లను కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ స్లిప్పులను ముద్రించి మండలాలకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈనెల 8వ తేదీ లోపు వీటి పంపిణీ పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే పోలింగ్,సహాయ పోలింగ్ అధికారులకు ఒక దశ శిక్షణ పూర్తి చేశామని, మైక్రో అబ్జర్వర్లకు ఈనెల 9న, ఆ తరువాత పిఒలకు అసిస్టెంట్ పిఒలకు 10వ తేదీన శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అందులో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి ఈనెల 11వ తేదీన శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డా॥ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్‌ఒ గాయత్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మెచ్చిరి కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని మెచ్చిరి సచివాలయం గ్రేడ్ 5 కార్యదర్శి గ్రేసీ మేరీని అనంతపురం జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు రాయదుర్గం ఎంపీడీవో కొండయ్య తెలిపారు. విధుల పట్ల అలసత్వం, సమయపాలన లేకపోవడం, ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బుధవారం సాయంత్రం సస్పెండ్ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. పథకాల పట్ల నిర్వహించిన సర్వే నివేదికలు ఇవ్వడంలో కార్యదర్శి బాధ్యతా రహితంగా వ్యవహరించిందన్నారు. ఇదిలావుండగా ప్రతి నెలా ఒకటవ తేదీన ప్రభుత్వం పంపిణీ చేసే వివిధ రకాల పింఛన్లకు సంబంధించి మెచ్చిరి గ్రామంలో 255 మంది లబ్ధిదారులు ఉన్నారు. రాయదుర్గం మండలంలోని పంచాయతీలకు సంబంధించి ఫిబ్రవరి 28వ తేదీన పింఛను సొమ్మును కార్యదర్శులు డ్రా చేశారు. మెచ్చిరి కార్యదర్శి మాత్రం మార్చి ఒకటో తేదీ (బుధవారం) ఉదయం 11 గంటలకు డబ్బు డ్రా చేసినట్లు తెలిసింది. రూ.6 లక్షలు పై చిలుకు నగదుకు గాను రూ.5 లక్షలే ఖాతాకు జమకావడంతో డ్రా చేయలేదని కార్యదర్శి అధికారులతో చెప్పకువచ్చింది. నగదు మొత్తాన్ని ఒకేసారి డ్రా చేయాలనే ఉద్దేశంతో మంగళవారం బ్యాంకు నుండి నగదును తీసుకోలేదని ఆమె చెప్పింది. పింఛన్ సొమ్ము కోసం నిరీక్షించిన వారు సర్పంచి ఉల్లెమ్మతో పాటు మండల పరిషత్ అధికారులకు విషయాన్ని తెలియజేశారు. ఎంపీడీవో కొండయ్య స్పందించి పింఛన్ల డబ్బును పంపిణీ చేయడంలో జాప్యం చేయకుండా చూడాలని డీడీవో హేమంత్ రాజును ఆదేశించారు. దీంతో ఆలస్యంగానే పింఛన్ల పంపిణీ జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

17లోగా వేతనాలు ఇవ్వకుంటే సమ్మె

కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేసిన శ్రీసత్యసాయి కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయిపడ్డ వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో ఈ నెల 17వ తేది నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ఓబులు, అధ్యక్ష, కార్యదర్శులు తిప్పేస్వామి, మక్బుల్‌బాషా తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి, శ్రీసత్యసాయి బోర్డ్ కార్యదర్శి, డిఇని వేరు వేరుగా కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాల కోసం వివిధ రూపాల్లో నిరసనలు చేపడుతున్నా సమస్యలు పరిష్కరించడంలో జాప్యం జరుగుతోందన్నారు. ప్రతి నెలా వేతనాలు అందుకునే పరిస్థితి కార్మికులకు లేకుండా పోయిందన్నారు. 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులకు ఉద్యోగ భద్రత, వేతనాల భద్రత లేదన్నారు. ప్రతి సారీ రోడ్లపైకి వస్తే తప్ప అధికారులు, ప్రభుత్వం స్పందించే పరిస్థితి కనిపించడం లేదన్నారు. 15 రోజుల్లోగా 5 నెలల వేతనాలు, 6 నెలల ఇఎస్ఐ, పిఎఫ్ డబ్బులు చెల్లించాలన్నారు. లేనిపక్షంలో 17వ తేది నుంచి కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు రమేష్‌రెడ్డి, శ్రీరాములు, ఆంథోనిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు హైస్కూల్ టీచర్ కులశేఖర్ రెడ్డికి షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

కలెక్టర్ ఆదేశాల మేరకు గార్లదిన్నె మండలం కల్లూరు హైస్కూల్ టీచర్ కులశేఖర్ రెడ్డికి బుధవారం షోకాజ్ నోటీసు జారీచేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా ఒక టీచర్ కి షోకాజ్ నోటీసు ఇవ్వడానికి ఆ జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒకి లెటర్ పెట్టినట్లు తెలిపారు. వీరిద్దరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని కలెక్టర్‌కి ఫిర్యాదులు రావడంతోనే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణతే ధ్యేయం

జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శంకర్

ప్రజాశక్తి-ఉరవకొండ

పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శంకర్ పేర్కొన్నారు. బుధవారం విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను, విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి వంద శాతం ఉత్తీర్ణత అయ్యేలా శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. పదవ తరగతి పరీక్షలకు ఇంకా 40 రోజులు సమయం ఉందన్నారు. ఈ సమయంలో విద్యార్థులు క్రమశిక్షణతో ఉపాధ్యాయుల దిశా నిర్దేశంలో వెళ్లి ప్రణాళిక ప్రకారం చదవాలని సూచించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించడానికి కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వమంగళం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రీతి నాయక్ మృతికి కారుకులైన వారిని శిక్షించాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎఐబిఎస్ఎస్ మహిళలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్రంలో వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి నాయక్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ నాయక్, పి.బాబు నాయక్, గౌరవ సలహాదారులు ఠాగూర్ నాయక్, సుగుణబాయి డిమాండ్ చేశారు. పీజీ చదువుతున్న మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతికి సంతాపం తెలుపుతూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్

ఎఐబిఎస్ఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ఆధ్వర్యంలో బుధవారం గీతామందిరం వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గీతా మందిరం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో మహిళలు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఐబిఎస్ఎస్ నేతలు మాట్లాడుతూ ధరావత్ ప్రీతి నాయక్ పట్ల సీనియర్ అంటూ కొందరూ వేధింపులకు గురిచేసి ఆమె మృతికి కారకులయ్యారని తెలిపారు. పీజీ పూర్తయితే సమాజానికి వైద్య వృత్తితో సేవ చేసే ప్రీతి నాయక్‌ను ఇలా అర్ధాంతరంగా మృతి చెందేలా చేయడం దుర్మార్గం అన్నారు. ప్రీతి మృతికి కారకులైన సైకోలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాగింగ్ భూతాన్ని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐబిఎస్ఎస్ మహిళా విభాగం నాయకులు శివమణిబాయి, చంద్రిక బాయి, ఉమా బాయి, రుక్మిణి బాయి, ఎల్ఐసి శివమణి బాయి, చాంద్రి బాయి, సరళమ్మ, యూత్ ప్రెసిడెంట్ రామాంజినేయులు, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, ప్రసాద్, శంకర్‌లాల్, భాస్కర్ నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందించడమే ధ్యేయం

ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని విడపనకల్ ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, సర్పంచి సుశీల ఉమాశంకర్ పేర్కొన్నారు. బుధవారం విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ గ్రామంలోని బిసి కాలనీలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జలజీవన్ మిషన్ కార్యక్రమంలో పైప్‌లైన్ పనులు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వీలైనంత తొందరలో పైపులైన్ పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికీ నూతన కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఓబులేసు, మాజీ సర్పంచులు కరణం భీమిరెడ్డి, మేకల పంపాపతి, వైసిపి నాయకులు మాల్యం ఎర్రన్న, జయరాముడు, చిన్న తిమ్మన్న, సునీల్ రెడ్డి, మనోహర్, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

'శ్రీ చైతన్య'లో సైన్స్ ఎగ్జిబిషన్

అనంతపురం : అనంతపురం ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రిన్సిపల్ పర్వీన్ భాను అధ్యక్షతన పిల్లలచేత తయారు చేయబడిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను బుధవారం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, రీసెర్చ్ స్కాలర్ త్రికాల మాధవి, ఎజిఎం సుబ్బారెడ్డి, కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాటిని ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ విద్యార్థులు తాము తయారు చేసిన పరికరాల ప్రాముఖ్యతను చెబుతుంటే ఆసక్తిగా విని ఆనందించారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ ఒక్కో సివి రామన్, అబ్దుల్ కలాం కావాలని, దేశ కీర్తి పతాకాన్ని యావత్ ప్రపంచమంతా చాటాలని పిల్లలను ఆశీర్వదించారు. ఉపాధ్యాయ బృందాలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

3న ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన

గుత్తి : మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్సీ ఓటు హక్కుదారులకు ఈనెల 3వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చిట్రా శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. ఓటు హక్కుదారులు ఓటు వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన కోరారు.

రామకృష్ణ కుటుంబ సభ్యులకు అధికారుల పరామర్శ

నార్పల : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న నార్పల మండల కేంద్రంలోని మసీదు కట్ట ప్రాంతానికి చెందిన రైతు పెరవలి రామకృష్ణ కుటుంబ సభ్యులను వ్యవసాయ అధికారి ముస్తఫా, విఆర్ఒ రామకృష్ణ, ఉప సర్పంచి శ్రీరాములు వార్డు మెంబర్ నాగరాజు, గ్రామ పెద్దలు శివయ్య, గాండ్ల రామకృష్ణ బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామని వారికి భరోసా ఇచ్చారు.

సమీక్ష సమావేశం

ఆత్మకూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా ఆత్మకూరు ఆరోగ్య కేంద్రంలో మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యత, బేటి బచావో బేటీ పడావో, దిశా, పోక్సో చట్టాలు, లింగ వివక్ష, చట్ట విరుద్ధంగా చేసే స్కానింగ్ అబార్షన్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైద్యులు దయాకర్, ఎంపిహెచ్ఇఒ నాగేశ్వరయ్య, పిహెచ్ఎన్ తులసమ్మ, హెడ్‌నర్స్ పద్మావతి, సూపర్ వైజరు వెంకటరత్నమ్మ, మహిళా పోలీస్ షబాన, ఎఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో నార్పల విద్యార్థిని ప్రతిభ

నార్పల : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలలో నార్పల మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థిని సాదియా ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు. ఫిబ్రవరి 28 తేదీ జరిగిన చిత్రలేఖన ఫైనల్ పోటీలో భారత దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నార్పల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆర్.అర్మ సాదియా ద్వితీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపల్ సంగీతకుమారి తెలియజేశారు. పాఠశాల సిబ్బంది సాదియాకు అభినందనలు తెలియజేశారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని అరకటవేముల, కడవకల్లు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో యోగానందరెడ్డి బుధవారం పరిశీలించారు. వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం ఆ గ్రామాల్లో సచివాలయాలను తనిఖీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పరిశీలించారు. కడవకల్లులో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఉరవకొండ : ఉరవకొండ గవిమఠం శ్రీ స్థిత చంద్రమౌళీశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి అధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరం రెండు రోజులు పాటు భక్తులకు అందుబాటులో ఉంటుందని వైద్యాధికారులు సాహితీ, వినీత తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పట్టణ ఆరోగ్య కార్యకర్తలు నిమ్మల వెంకటేష్, మోతీలాల్ నాయక్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ మమత, సులోచన, ఆశా కార్యకర్తలు శిరీష, కళ్యాణి పాల్గొన్నారు.



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కారుచౌకగా భూములు దోచుకున్న జెసి సోదరులు..

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

పేదల నుంచి కారు చౌకగా భూములు దోచుకున్న ఘనత జెసి సోదరులదే అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. బుధవారం రెండవ రోజు పెద్దారెడ్డి ప్రజా సంక్షేమ యాత్ర పెద్దపప్పూరు మండలంలోని సోమనపల్లి, తిమ్మనచెరువు జూటూరు గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ.. జెసి సోదరులకు సొంత గ్రామం అయిన జూటూరులో 300 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం హయాంలో వీఆర్వోల ద్వారా పేద రైతుల భూముల లిస్టు తీసుకొని వాటిని రూ.50 వేలకు కారు చౌకగా కాజేశారన్నారు. దేవాదాయ భూములు, దళితుల భూములను కాజేశారన్నారు. ఈ పొలాలకు నీరు పారేందుకు పెన్నానది పరిసర ప్రాంతంలో పెద్ద కట్టకట్టి చాగల్లు ప్రాజెక్టుకు నీరు వెళ్లకుండా మళ్లిస్తున్నారని తెలిపారు. తద్వారా తమ బోర్లలో నీరు వచ్చే విధంగా చేసుకున్నారన్నారు. ఇలాంటి నీచమైన సంస్కృతి జెసి సోదరులది అని విమర్శించారు. ఏమైనా జెసి బ్రదర్స్‌తోనే రాజకీయం చేస్తానని సవాల్ విసిరారు. గ్రామాల్లో కక్షలు రేపే సంస్కృతి తనది కాదన్నారు. పప్పూరమ్మ దేవాలయం మాన్యాలను వదలని జేసీ ఆలయం బాగోగులపై ఏనాడూ ఆసక్తి చూపలేదన్నారు. ఇసుక దోపిడీ చేస్తున్నానంటూ గ్రామాల్లో కక్షలు రేపడానికి జెసి బ్రదర్స్ కరపత్రాలు ముద్రించి పంచుతున్నారన్నారు. దమ్ము ధైర్యం ఉంటే ఇసుక రవాణాలో తనకు పోలీసులకు సంబంధం ఉందని నిరూపించాలన్నారు. జగన్ ప్రభుత్వంలో ఇసుక రవాణా ప్రభుత్వ పాలసీపై నడుస్తోందన్నారు. 9 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఇసుక రవాణా ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా కేవలం వైసీపీకి తాడిపత్రి నియోజకవర్గంలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కరపత్ర రాజకీయాలకు జెసి సోదరులు తెర లేపారన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి రమాదేవి ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, బొందలదిన్నె రామయ్య, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేమనాథ్‌రెడ్డి, జిల్లా పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, యోగిశ్వర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తురకపల్లి లక్ష్మిరెడ్డి, జూటూరు ఎంపీటీసీ అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

నేడు ఇండియన్ స్పైస్ ఏసీ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్ లోపలిభాగం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సుభాష్ రోడ్డులో నూతనంగా నిర్మించిన ఇండియన్ స్పైస్ టెస్ట్ ఆఫ్ బిర్యానీ మల్టీ క్యూసన్ ఏసీ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను గురువారం ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ అధినేతలు రాజన్న, ఆదినారాయణ, పోతులయ్య, రామాంజనేయులు ప్రజాశక్తితో తెలిపారు. కుటుంబ సమేతంగా ఒకే చోట విందు ఆరగించేందుకు వీలుగా ఆధునిక వసతులతో రెస్టారెంట్‌ను రూపొందించినట్లు తెలిపారు. రెస్టారెంట్ నందు వందమంది ఒకేసారి కూర్చుని తినేందుకు వీలుగా సిట్టింగ్ కెపాసిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇండియన్ చైనీస్, అరబిక్, తందూరి రెస్టారెంట్, స్పెషల్ గార్లిక్ బిర్యానీ, వెరైటీ బిర్యాని ఐటమ్స్ తమ వద్ద లభిస్తాయని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 12వ తేదీ వరకు కస్టమర్లకు 25% డిస్కౌంట్ అందిస్తున్నట్లు తెలిపారు. నగరం నడిబొడ్డున ఫంక్షన్లను చేసుకునేందుకు లీలుగా 150 మంది సిట్టింగ్‌తో మినీ ఫంక్షన్ హాలు అందుబాటులో ఉందని తెలిపారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు హాజరవుతున్నట్లు చెప్పారు.



కనకదాస విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి ఉష శ్రీచరణ్

కనకదాసుకు మంత్రి ఉష శ్రీ నివాళి

బెలుగుప్ప : మండల పరిధిలోని కాలువపల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన భక్త కనకదాస విగ్రహానికి మంత్రి ఉషా శ్రీచరణ్ బుధవారం పూలమాలవేసి పూజలు నిర్వహించారు. ముందుగా మంత్రి ఉషా శ్రీచరణ్ కురుబ మహిళలు, సోదరులు పూలతో ఘన స్వాగతం పలికారు. మంత్రి కురుబ సోదరీ సోదరులతో కలిసి జై కురుబ.. జై కనకదాస అని నినాదాలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. కాలువపల్లి గ్రామంలో కురుబ కులస్తులు తక్కువగా ఉన్నా కనకదాస విగ్రహాన్ని ప్రతిష్ఠించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రిబోర్డ్ చైర్మన్ శ్రీనివాసులు, సర్పంచి పెద్దన్న, కురువ సంఘం అధ్యక్షుడు కరుణాకర్, హనకనహాల్ మల్లికార్జున, తగ్గుపర్తి రాజగోపాల్, మల్లికార్జున, మాజీ ఎంపీటీసీ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం

భక్తులతో పోటెత్తిన గవిమఠం సంస్థానం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండలో ప్రసిద్ధి చెందిన గవిమఠం శ్రీ స్థిత చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం వేలాది మంది భక్తుల కోలా హాలాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాదీ గ్రామ పంచాయతీ వారు రథోత్సవం అలంకరణకు పూలను స్థానిక కార్యాలయం నుంచి రథోత్సవం వరకు పురవీధుల్లో మేళ తాళాలతో తీసుకొచ్చారు. అనంతరం గవి మఠం పీఠాధిపతి చెన్న బసవ రాజేంద్ర మహా స్వాములు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి రథముపై కొలువు తీర్చారు. అశేష జనవాహిని శివనామ స్మరణతో రథోత్సవం కమనీయంగా సాగింది. భక్తులు రథంపై పూలు పండ్లు విసిరి మొక్కులను తీర్చుకున్నారు. రథోత్సవం ముందు మఠం ఏనుగు ఆకర్షణగా నిలిచింది. రథోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు ప్రణయ్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, సర్పంచి లలితమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గవి మఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర స్వామి, ఆదోని చౌకీ మఠం పీఠాధిపతి కళ్యాణ స్వామి, గవిమఠం అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ పాల్గొన్నారు. ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు

గవిమఠం స్థిత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి మహా రథోత్సవంలో భాగంగా హాజరయ్యే భక్తుల దాహార్తి తీర్చడం కోసం ఫ్రెండ్స్ మజ్జిగ చలివేంద్రాలను బుధవారం ఏర్పాటు చేశారు. ఉరవకొండలో ఉష్ణతాపం అధికమయింది. స్వామి వారి సేవలో భాగంగా ఫ్రెండ్స్ మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేసి తద్వారా భక్తుల దాహార్తిని తీర్చారు. దీంతో నిర్వాహకులను భక్తులు అభినందనలు తెలిపారు. ఈ మజ్జిగ కేంద్రాలను రథోత్సవం సందర్భంగా, గురువారం లంకా దహనానికి హాజరయ్య భక్తుల సౌకర్యార్థం రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇది ఇలా ఉంటే స్థానిక పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో పలుచోట్ల తాగునీటి చలివేంద్రాలను ఏర్పాటు చేసి భక్తుల దాహార్తిని తీర్చారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

అనంతలక్ష్మి కళాశాల ఛైర్మన్ అనంత రాముడు

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు బాగా చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ అనంతరాముడు పిలుపునిచ్చారు. బుధవారం అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవం, ఛైర్మన్ అనంత రాముడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెఎన్‌టియు విసి రంగ జనార్ధన, గౌరవ అతిథిగా రిటైర్డ్ ఐఎఎస్ సుబ్రహ్మణ్యం, విశిష్ట అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల విభాగాధిపతులు, సిబ్బంది ఛైర్మన్ అనంత రాముడును గజమాలతో సత్కరించారు. ఈ సదర్భంగా కళాశాల ఛైర్మన్ అనంతరాముడు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలకు సక్రమంగా హాజరై మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. నూరు శాతం ప్లేస్‌మెంట్ సాధించే దిశగా ప్రఖ్యాత సంస్థలతో ఒప్పందాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతలక్ష్మి కళాశాల విద్యార్థులు దేశ విదేశాల్లో ఉద్యోగాలు పొందే విధంగా తర్ఫీదు ఇవ్వడానికి తగిన సౌకర్యాలు కల్పిస్తామని తెలియజేశారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ రంగ జనార్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి వేరొకరికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. కషి ఉంటే మనుషులు సాధించలేనిదంటూ ఉండదని తెలియజేశారు. విద్యార్థులకు అనేక సౌకర్యాలు కలిగించి అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌ని స్థాపించడం ఆనందంగా ఉందని విశిష్ట అతిథి ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి స్థాయిలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. గౌరవ అతిథి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి విద్యార్థులు చేరుకోవాలని, స్వామి వివేకానంద, మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఆత్మవిశ్వాసంతో ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని తెలియజేశారు. అనంతరం కళాశాల ప్రథములుగా నిలిచిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రమేష్ నాయుడు, ప్రిన్సిపల్ మూర్తిరావు ఖోకలే, స్కిల్ డెవలప్‌మెంట్ డైరక్టర్ సురేంద్రనాయుడు, వైస్ ప్రిన్సిపల్ రామసుబ్బారెడ్డి, విభాగాధిపతులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న విసి రంగజనార్ధన తదితరులు

జెఎన్‌టియులో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో హెట్రో ల్యాబ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈఈఈ విభాగంలో బుధవారం క్యాంపస్ ప్లేస్ మెంట్స్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన, రెక్టార్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య విజయ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, ప్రిన్సిపాల్ ఆచార్య పి. సుజాత మర్యాద పూర్వకంగా కలిసి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మంచి ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఉపకులపతి మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాలను ఎక్కువగా కలుగజేయాలని కంపెనీ వారిని కోరారు. ఈ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌లో 51 మంది కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు రాత పరీక్షల్లో పాల్గొన్నారు. వారిలో 37 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థులకు టెక్నికల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి డాక్టర్ జె.శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెట్రో ల్యాబ్ కంపెనీ అధికారులు హరీష్, శ్రీ సీమన్ హాజరయ్యారు.

ఆలయ స్థలం అన్యాక్రాంతం

ప్రజాశక్తి-కుందుర్పి

మండల కేంద్రమైన కుందుర్పిలో అతి పురాతనమైన వీరభద్ర స్వామి దేవాలయం స్థలం అన్యాక్రాంతమైంది. ఆ స్థలాన్ని పరిరక్షించాలని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పురావస్తు శాఖ అధికారి రజిత, స్థానిక తహశీల్దార్‌కు రెండు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. అయినా ఎవ్వరూ పట్టించుకోలేదు. రెండేళ్ల క్రితమే గ్రామ సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి, వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, ఎస్ఎంసి ఛైర్మన్ లక్ష్మణమూర్తి, గ్రామ పెద్దలు పెద్ద ఓబులేసు, టీచర్ తిమ్మప్ప ఆక్రమణదారులతో మాట్లాడి ఆ స్థలంలో కల్యాణమండపం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే హామీని నెరవేర్చడంలో వారు విఫలమయ్యారు. వీరభద్రస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. జిల్లా నుంచే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. ఆలయ అభివృద్ధికి లక్షలాది రూపాయలు విరాళంగా ఇస్తున్నారు. ఆలయ స్థలంలో రూ.కోటితో కల్యాణమండపం నిర్మాణానికి దాతలు ముందుకువస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి రక్షించాలని ఆలయ కమిటీ సభ్యులు విశ్వనాథ్, సత్యనారాయణ గుప్తా, జి.చంద్రమౌళి, నాగభూషణ, జి.నాగరాజ్ కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన ఆలయ స్థలం ఇదే..

నేరాలు ఘోరాలు

బంగారు నగలు అపహరణ

గుత్తి : పట్టణ శివారులో మంగళవారం రాత్రి కెఎస్ ఆర్టీసీ బస్సులో చోరీ జరిగింది. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన దేవి తన భర్త పక్కీరప్పతో కలిసి గుంతకల్లులోని బంధువుల వివాహానికి వెళ్లారు. అక్కడ నుంచి స్వగ్రామానికి వెళ్లడానికి కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. గుత్తి సమీపంలో ఇద్దరు వ్యక్తులు బస్సు నుంచి కిందకు దిగి వెళ్లిపోయారు. దేవి అనుమానంతో తన పర్స్ పరిశీలించగా మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గ్రహించారు. సంఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కర్నాటక మద్యం ప్యాకెట్లు పట్టివేత

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో బుధవారం తెల్లవారుజమున అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం పాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. సమాచారం మేరకు సిఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టగా అనంతపురం వైపు నుంచి వస్తున్న కెఎ 19 ఎంఎ 7155 అనే నంబర్ స్కార్పియో వాహనాన్ని నిలిపివేసి నిందితులు పరారయ్యారు. స్కార్పియో వాహనాన్ని పరిశీలించగా అందులో రూ.లక్ష విలువజేసే 50 బాక్సుల టెట్రా పాకెట్లు ఉండగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు విచారణ చేపట్టారు.

వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

లేపాక్షి : మండలం పరిధిలోని చోళసముద్రం గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన కేశవప్ప(58) పొలం వద్ద నుండి వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కేశవప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య గంగమ్మ, ఒక కుమారుడు ఉన్నారు. కూతురుకు వివాహం అయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

బుక్కపట్నం : మండల కేంద్రంలో నివాసం ఉంటున్న వ్యక్తి అదృశ్యమైనట్లు కేసు నమోదు అయిందని ఎస్ఐ నరసింహుడు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చింతకాయల రాము రెండు రోజులు క్రితం సాయంత్రం పూట బజారుకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితులు చుట్టుపక్క గ్రామాలలో వెతికినప్పటికీ ఆచూకీ తెలియరాలేదు. దీంత రాము భార్య పార్వతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాముకు మానసిక స్థితి సరిగా లేదు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూలీలకు పనులు కల్పించండి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో యోగానందరెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రోజూ 2000 మంది ఉపాధి పనులకు వచ్చేలా చూడాలన్నారు. పని ప్రదేశం నుండి రోజూ రెండు ఫొటోలు తప్పనిసరిగా పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండల కేంద్రంలోని పశువైద్యశాల ఆవరణంలో పశువ్యాధి నివారణ పథకాన్ని బుధవారం ప్రారంభించారు. అందులో భాగంగా స్థానిక సుల్తాన్ పేటలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ.కార్యక్రమంలో అనంతపురం ఉపసంచాలకు రమేష్‌రెడ్డి, బుక్కరాయసముద్రం సహాయ సంచాలకులు రత్నకుమార్, పశువైద్య అధికారి గోవిందరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 31వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకుని రైతులు తమ పాడిపశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోవాలని కోరారు. సిబ్బంది చంద్రకళ, ధనలక్ష్మి, సురేష్ కుమార్, కృష్ణవేణి, గోపాలమిత్రలు రాజారెడ్డి, కాతమయ్య, రామ్మోహన్‌నాయుడు, జయరాం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ కోసం వ్యాక్సినేషన్ చేయించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. పట్టణంలోని పెంపుడు కుక్కలకు వ్యాప్తి చెందే వ్యాధి సంక్రమించకుండా నివారించేందుకు కుక్కలకు మార్కెట్ యార్డులోని వెటర్నరీ ఆసుపత్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుండి నాలుగు గంటల వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. పట్టణంలో కుక్కలను పెంచుతున్న యజమానులు వాటికి తప్పని సరిగా వ్యాక్సినేషన్ వేయించాలని కోరారు. పెంపుడు కుక్కలు ఉన్నవారు మున్సిపాల్టీలో లైసెన్సు పొందాలన్నారు. లేని పక్షంలో మున్సిపల్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీధి కుక్కలకు కూడా అతి త్వరలో వ్యాక్సినేషన్ చేస్తామని చెప్పారు. ఎలాంటి సందేహాలు ఉన్నా వెటర్నరీ అసిస్టెంట్ పెన్నప్ప 8179270150 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బి.సురేష్

ప్రజాశక్తి-గుంతకల్లు

శ్రీకాకుళంలో గత నెల ఫిబ్రవరి 25, 26 తేదీలలో జరిగిన ఐఎఫ్‌టియు 9వ రాష్ట్ర మహాసభల్లో అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న గుంతకల్లు పట్టణానికి చెందిన బి.సురేష్‌ను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఆయన పత్రికలకు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. శ్రీకాకుళంలో జరిగిన ఐఎఫ్‌టియు రాష్ట్ర మహాసభల్లో కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు, హిందూ మతోన్మాదం, మోడీ ఫాసిస్ట్ పరిపాలనతో భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం ఎంతగా దెబ్బతిందో చర్చించామన్నారు. మోడీ సర్కారు కార్పొరేట్ కంపెనీలకు, ఆదాని, అంబానీ కంపెనీలకు ఊడిగం చేస్తూ శ్రామిక వర్గ ప్రజల హక్కులను అణిచివేస్తోందన్నారు. తిరుపతిలో ఏప్రిల్ 16, 17, 18 తేదీలలో జరుగనున్న ఐఎఫ్‌టియు జాతీయ మహాసభల్లో కేంద్రం విధానాలపై సమగ్రంగా చర్చలు జరిపి జాతీయ స్థాయిలో పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తారన్నారు. తనతో పాటు అనంతపురం జిల్లాకు చెందిన ఏసురత్నం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలియజేశారు.

సిపిఐ, ఎఐఎస్ఎఫ్ నాయకుల అరెస్టు

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన విజయవాడ మహాధర్నాకి వెళ్లకుండా సిపిఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పేదల ఇళ్ల నిర్మాణాలకి రూ.5 లక్షలు ఇచ్చి వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్రేష్, నాయకులు దుర్గన్న, నరసింహులు, తిప్పేస్వామి, నాగరాజ్, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు అంజి, కుమార్, అనిల్, వీరేష్, నవీన్, దాదాపు 22 మందిని అరెస్టు చేశారు.

పెద్దపప్పూరు : సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అమ్మలదిన్నె కుళ్లాయప్ప, మండల సహాయ కార్యదర్శి బోగాతి రమేష్‌రెడ్డి, మహిళా నాయకురాలు కుల్లాయమ్మ లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని చింతా పురుషోత్తం ప్రభుత్వాన్ని హెచ్చరించారు.